ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY


కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 26 ఫిబ్రవరి 2025 | 5



మహా.. శివుడు



మండపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివుడు మన చెంత కొచ్చాడు.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో కొలువయ్యాడు.. దేశంలో ఆదియోగి భారీ విగ్రహాలు కోయంబత్తూరు, బెంగళూరుల్లో 112 అడుగులు చొప్పున రెండు ఉన్నాయి. ద్వారపూడిలో మూడోది కొలువుదీరింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగులు వెడల్పుతో నిర్మించిన ఈ విగ్రహాన్ని మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 5.30 గంటలకు ఆవిష్కరించనున్నారు. తమిళనాడుకు చెందిన ఎస్ఎల్ కనకరాజు చాలా ఏళ్ల కిందట ద్వారపూడి వచ్చి అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఆయన ఇటీవల బెంగళూరులోని తన కుమారుడి వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఆదియోగి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ద్వారపూడిలో కూడా ఇలాంటి విగ్రహం ఏర్పాటు చేయాలని బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన శిల్పి పడాల పెదరాఘవను సంప్రదించారు. పది నెలల్లో రూ.30 లక్షలు ఖర్చుచేసి విగ్రహాన్ని ఇలా తయారు చేశారు. విగ్రహం వెనుక భాగం లోపల శివలింగంతోపాటు 40 మంది వరకు కూర్చుని ధ్యానం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహం ముందు వినాయకుడు, కుమారస్వామి, నాలుగు వైపులా వశిష్ఠ, అత్రి, గౌతమ, కశ్యప, జమదగ్ని, విశ్వామిత్ర, వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

శివరాత్రికి ముస్తాబు



శివరాత్రి వెలుగులు: విద్యుత్ ధగధగల మధ్య పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయం

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. గోదావరి రేవులు సిద్ధమయ్యాయి.. ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళా నేపథ్యంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రాధాన్యం పెరిగింది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రధాన ఆలయాలు ఉన్నాయి.. ఆయా ఆలయాలకు భక్తజనం పోటెత్తుతారు. పిఠాపురం పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోటలో పంచారామ క్షేత్రమైన కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయాల వద్ద పోలీస్ బందోబస్తు మధ్య ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. - లోపల పేజీల్లో

శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన పాదగయ కుక్కుటేశ్వర స్వామి

శివాలయానికో.. చరిత్ర!

6

శివాలయాలకు ఒక్కో ఊరిలో ఒక్కో పేరు.. ఆలయాలకు వెళతాం.. ఆ ఆది దేవుడిని దర్శించుకుని వచ్చేస్తాం.. ఆ ఆలయానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఆలో చనలో పడతాం.. ప్రతి ఆలయానికి ఆ పేరు రావడానికి ఓ చరిత్ర ఉంది.. అదేమిటో తెలుసుకోవాలనుందా.. అయితే ఒకసారి 6వ పేజీలోకి వెళ్లాల్సిందే మరి..

పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా చైత్రవర్షిణి



పిఠాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పాడా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎ.చైత్రవర్షిణి నియమితులయ్యారు. రాష్ట్రవ్యాపంగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ప్రస్తుతం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ పేషీలో ఓఎస్డీ పని చేస్తున్న ఆమెను పీడీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. పిఠాపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ ఏర్పాటైన తర్వాత తొలి పీడీగా శ్రీధర్‌కు కలెక్టర్ షాన్ మోహన్ తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. ఈయనతోపాటు పలువురు అధికారులను డిప్యుటేషన్‌పై పాడాలో నియమించారు. ఈ సిబ్బందితోనే విజన్ 2029 డాక్యుమెంట్ రూపకల్పన తదితర అంశాలపై అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ఇప్పుడు రెగ్యులర్ పీడీగా డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న చైత్రవర్షిణిని నియమించడంతో పాడా కార్యాకలాపాలు మరింత ఊపందుకోనున్నాయి.

కాకినాడ కలెక్టరేట్‌లో 'పెద్దాపురం రూరల్' పంచాయితీ

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): రెండువారాలుగా పెద్దాపురం రూరల్ మండలం ఎంపీడీవో, వీఆర్వోల మధ్య జరుగుతున్న వివాదం చిలికిచిలికి గాలివానలా మారి కలెక్టరేట్‌లో పంచాయితీ వరకు వచ్చింది. కలెక్టర్ షాన్‌మోహన్, డీఆర్వో వెంకట్రావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జడ్పీ సీఈవో లక్ష్మణరావులు దీనిపై చర్చించారు. సమస్య పరిష్కారం దిశగా సమీక్షించారు. ఈనెల 11న పెద్దాపురం రూరల్ మండల ఎంపీడీవో శ్రీలలిత ఆర్‌బీ కొత్తూరు గ్రామ సచివాలయం తనిఖీలకు వెళ్లారు. అక్కడ బయోమెట్రిక్ హాజరు, మూమెంట్ రిజిస్ట్రర్‌ను పరిశీలించారు. వీఆర్వో లేకపోవడం, మూమెంట్ రిజిస్ట్రర్‌లో ఎక్కడకి వెళ్లింది నమోదు చేయకపోవడం గుర్తించారు. ఇతర గ్రామాల్లోనూ మరో ఏడుగురు వీఆర్వోలు అప్పగించిన పనులను సక్రమంగా చేయకపోవడం గుర్తించారు. ఎంపీడీవో ఈనేపథ్యంలో ఒక వీఆర్వోకు షోకాజ్‌నోటీసు, మరో ఏడుగురికి మెమోలు జారీచేశారు. తాము పంచాయతీరాజ్‌పాటు తహశీల్దార్ జారీచేసే విధులను నిర్వహించాల్సి ఉందని, షోకాజ్ నోటీసులు జారీ చేయడం తగదంటూ పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట వీఆర్వోలు ధర్నా చేశారు. దీంతో ఈ వివాదంలో సయోధ్యకు కలెక్టర్ ప్రయత్నిస్తున్నారు.

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

రేపే ఎమ్మెల్సీ పోలింగ్

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. గురువారం పోలింగ్ జరగనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 62,970 మంది ఓటర్లకు 92 పోలింగ్ కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 64,471 మంది ఓటర్లకు 95 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 70,504 మంది ఓటర్లకు 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం అధికారులకు బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేయనున్నారు. బరిలో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీపడతారు. హోరాహోరీగా సాగిన ప్రచారంలో అభ్యర్థులంతా ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రచారంలో ఎక్కడా చిన్నపాటి వివాదాలు తలెత్తలేదు. ప్రచారం ప్రశాంతంగా ముగిసింది. 7



మల్కిపురం మండలం గూడపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం. చిత్రంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్

కెనరా బ్యాంక్ Canara Bank — నాగమల్లితోట బ్రాంచ్, 67-15-30, నాగమల్లితోట జంక్షన్, కాకినాడ-533003. ఫోన్: 8331015634

లాకర్ ఓపెనింగ్ (బ్రేక్ ఓపెన్) నోటీసు

కెనరా బ్యాంక్ యొక్క దిగువ పేర్కొన్న శాఖలలో (ఇ సిండికేట్ బ్యాంక్ బ్రాంచ్‌లతో సహా) వెలగా కనక దుర్గా దేవి గారు సేఫ్ డిపాజిట్ లాకర్ల సౌకర్యాన్ని పొందారని సంబంధిత వ్యక్తులందరికీ మరియు సాధారణంగా ప్రజలకు పబ్లిక్ నోటీసు ఇవ్వబడుతుంది. కెనరా బ్యాంక్ నాగమల్లితోట బ్రాంచ్ నుండి ఇప్పటికే మా బ్యాంక్ రికార్డుల ప్రకారం లాకర్ అద్దె బకాయిలను చెల్లించమని అభ్యర్థనతో మా బ్యాంక్ రికార్డుల ప్రకారం అందుబాటులో ఉన్న తాజా చిరునామాలో లాకర్ అద్దెదారులకు/LOAకి అక్నాలెడ్జ్‌మెంట్ (AD)తో రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా వ్యక్తిగత లేఖలు / నోటీసులను ఇప్పటికే పంపడమైనది. అయినప్పటికీ, లాకర్ అద్దెదారులు/LOA మా శాఖను సంప్రదించలేదు మరియు లాకర్ అద్దె బకాయిలను చెల్లించలేదు. క్రింద పేర్కొన్న లాకర్ హైరర్లు మరియు వారి చట్టపరమైన వారసులు దీనిని తుది నోటీసుగా పరిగణించి, అవసరమైన పత్రాలతో మా శాఖను సంప్రదించవలసిందిగా అభ్యర్థించడమైనది. ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 30 రోజులలోపు లాకర్ అద్దె బకాయిలను చెల్లించండి, అది విఫలమైతే బ్యాంక్ ఎటువంటి తదుపరి నోటీసు లేదా సమాచారం లేకుండా లాకర్లను తెరుచుటకు మరియు దాని అద్దెదారులు మరియు వారి చట్టపరమైన ప్రతినిధులు బాధ్యులగుదురు.

క్ర.నెం.	లాకర్ నెం.	లాకర్ అద్దె బకాయి	లాకర్ అద్దెదారు పేరు & చిరునామా
1.	62 (123001677853)	రూ. 9204/-	వెలగా కనక దుర్గా దేవి, భర్త: వి సుబ్బారావు, డోర్ నెం.4-153/2, రోడ్డు నెం.4, వలసపాకల, కాకినాడ.

తేది: 26-02-2025, ప్రదేశం: కాకినాడ — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

ఓం నమశ్శివాయ..

ప్రతిక్షేత్రానికి ఓ నామం.. ప్రతి నామానికి ఓ ప్రాశస్త్యం

ప్రతీ శైవ క్షేత్రానికి ఓ ప్రత్యేక నామం.. పురాణ విశిష్టతలెన్నో.. 'ఉమ్మడి' గోదావరి ఆధ్యాత్మిక ధామం



ఆది దేవుడు శివుడు. సృష్టికి మూలకారకుడు అతడే. అందుకే పరమాత్మగాను, రుద్రుడిగానూ కొలుస్తాం. సదాశివుడు అంటే ఆది అంతం లేనివాడని అర్థం. అందుకే శివుడిని ఆరాధించని వాళ్లు అరుదు. ముఖ్యంగా మన గోదావరి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలు ఇంకెక్కడా ఉండవేమో. పంచారామ క్షేత్రాల్లో రెండు మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. ద్రాక్షారామ, సామర్లకోటల్లో అవి కొలువై ఉన్నాయి. ఇవిగాకుండా కోటిపల్లి శైవ క్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. రాజమహేంద్రవరంలో కోటిలింగాల క్షేత్రం, పిఠాపురంలో పాదగయ, కోనసీమలో కుండలేశ్వరం విశిష్టమైన శైవక్షేత్రాలు. ఇలా ప్రధానమైన శైవ క్షేత్రాల స్థల పురాణాలు కూడా ఆసక్తికరమే. అసలు ఆయా శైవ క్షేత్రాల్లో శివుడికి ఆ పేర్లు ఎందుకొచ్చాయో తెలియజేసే ప్రత్యేక కథనం..

'కోటి'ఫలితాల క్షేత్రం




పురాణ ప్రసిద్ధిగాంచిన కోటిపల్లి

(ఆంధ్రజ్యోతి- కె.గంగవరం)

కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఏ పుణ్య కార్యం చేసినా కోటి ఫలితాలు సిద్ధిస్తాయని పురాణ ప్రసిద్ధి. గోదావరి నది ఒడ్డున ఉన్న కోటిపల్లి పుణ్యక్షేత్రంలో రాజరాజేశ్వరి సహిత ఛాయా సోమేశ్వరసామి, అమ్మవారితో కూడి కోటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సహిత సిద్ధి జనార్దనస్వామి వేంచేసి ఉన్నారు. బ్రహ్మాండ పురాణం ప్రకారం ఈ మూడు విగ్రహాలను ఇంద్రుడు, చంద్రుడు, కశ్యపమహర్షి ప్రతిష్ఠించారని చెబుతోంది. తాము చేసిన పాపాలు పోగొట్టుకోవడానికి ఇంద్రుడు ఉమాసమేతుడైన కోటేశ్వర లింగాన్ని, రాజరాజేశ్వరి సమేతుడైన ఛాయా సోమేశ్వరుడిని చంద్రుడు ప్రతిష్ఠించారని, సిద్ధి జనార్దనస్వామిని కశ్యప మహర్షి ప్రతిష్ఠించాడని, ఆయన క్షేత్రపాలకుడని అంటారు. ఈ క్షేత్రం గోదావరికి ఉత్తరపు ఒడ్డున ఉంది. గౌతమ మహర్షి దీన్ని ఇటువైపు మళ్లించాడని కథనం. ఇందులో స్నానాలు ఆచరిస్తే చేసిన సర్వ పాపాలు పోతాయని ప్రతీతి.

కోడి రూపంలో శివుడు





గయాసురుడిని సంహరించేందుకు కోడి రూపం ధరించి ఇక్కడ లింగరూపుడు అయ్యాడు పరమశివుడు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామిగా భక్తులతో పూజలు అందుకుంటున్నారు. ఇక్కడ గయాసురుడి విగ్రహం కూడా ఉంటుంది. గయాసురుడిని సంహరించినప్పుడు పాదాలు ఇక్కడ పడడంతో ఇది పాదగయగా ప్రసిద్ధి గాంచింది. పూర్వం గయాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. ఇతను చేసే సత్కార్యాలు, దానధర్మాలతో ఇంద్రాదిపత్యం కలిగింది. త్రిలోకాలను పాలిస్తూ ప్రజల మన్ననలను పొందాడు. దీంతో దేవతలు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శరణు కోరారు. ఏదడిగినా దానమిచ్చే గుణమున్న గయాసురుని వద్దకు త్రిమూర్తులు మారువేషాల్లో వచ్చారు. లోకం సుభిక్షంగా ఉండాలని ఒక యజ్ఞం తలపెట్టామని, దానికి మీ సహకారం కావాలని కోరారు. దానికి గయాసురుడు అంగీకరించాడు. ఏడు రోజులపాటు జరిగే ఈ యజ్ఞానానికి భూమి, ఆకాశాలు పనికిరావని, నీ శరీరాన్నే వేదికగా చేయాలని కోరగా అంగీకరించాడు. ఆరు రోజులు పూర్తయిన అనంతరం ఏడవ రోజున తెల్లవారుజాము కాకుండానే శివుడు కోడి(కుక్కుటం) ఆకారం ధరించి కొక్కొరొకో అని కూత కూశాడు. దీంతో యజ్ఞం పూర్తయిందని భావించి గయాసురుడు యజ్ఞవేదికగా ఉన్న తన శరీరాన్ని కదిపాడు. దీంతో ఆగ్రహించిన త్రిమూర్తులు నీ వల్లే యజ్ఞం భంగం అయిందని, కనుక సంహరిస్తామని చెప్పి వరం కోరుకోమన్నారు. అతని కోరిక మేరకు గయాసురుడి శరీర భాగాలు పడినచోట పితృకార్యాలు చేసి గయాశ్రార్ధమస్తు గయ గయ అని ఉచ్ఛరిస్తే పితృకార్యం సఫలం అవుతుందని వరమిచ్చారు. అనంతరం గయాసురుడి శరీరాన్ని మూడు భాగాలు ఖండించారు. శిరస్సు బీహార్‌లోని గయలో పడగా శిరోగయ, నాభి ఒరిస్సాలోని జాజిపూర్‌నందు గల గయలో పడగా నాభిగయ, పిఠాపురంలో పాదములు పడడంతో పాదగయగా పిలువబడుతూ ప్రసిద్ధిగాంచాయి. గయాసురుని సంహరించడానికి శివుడు కోడిరూపాన్ని ధరించినందున ఈ క్షేత్రంలో స్వయంభువ కోడిరూపమున స్ఫటిక లింగాకారంలో వెలసి కుక్కుటేశ్వరుడిగా పూజలు అందుకొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)



'కుండల' ఈశ్వరం



కుండలేశ్వరంలో వృద్ధ గౌతమిలో స్నానమాచరించి కుండలేశ్వరుని కరుణాకటాక్షాల కోసం అర్రులు చాస్తున్నామని పవిత్ర కాశీలోని పండితులు అంటుంటే తాను ఆశ్చర్యానికి లోనైనట్టు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారంటే కుండలేశ్వర విశిష్టత ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అమలాపురానికి సమీపంలో వృద్ధ గౌతమీ నదీతీరాన కాట్రేనికోన మండలంలో ఉన్న కుండలేశ్వర క్షేత్రంలో సూర్యుని కుండలాల ఆకారంలో శివలింగాన్ని గౌతమముని ప్రతిష్ఠించారని పురాణ గాథ. కవి సార్వభౌముడు శ్రీనాథ మహాకవి తన భీమఖండంలో కుండలేశ్వరం గురించి రాశాడు. కోటిపల్లిలో సోమేశ్వరుడు గాక దక్షిణ భాగం నుంచి గౌతమముని తీసుకొచ్చిన గోదావరి నది ప్రవహిస్తూ సముద్రం కేసి వెళుతోంది. చాలా వేగంగా వెళుతున్న గోదావరికి సముద్రపు ఘోష వినిపించింది. దీంతో మహా వేగంతో పాతాళలోకంలోకి ప్రవేశించి ఈ సముద్రుడితో గోదావరి భేదించాలనుకుంది. గోదావరి ఆలోచనలను నదులన్నింటికీ నాథుడైన సముద్రుడు గ్రహించి పూజా ద్రవ్యాలను, తన కుండలాలను ఒక పళ్లెంలో ఉంచి గౌతమికి ఎదురెళ్లాడు. గౌతమి నదికి కోపం పోగొట్టడానికి సాష్టాంగ నమస్కారం చేసి, సూర్యభగవానుని తేజస్సుతో మెరుస్తున్న ఈ కుండలాలను నీకు బహుమతిగా ఇస్తున్నానని తెలిపాడు. లోగడ వరుణదేవుడి తపస్సు చేసి సూర్యుడి అనుగ్రహంతో వీటిని పొందాడని వివరించాడు. దీంతో గౌతమీ నది నెమ్మదించి అక్కడ ఈశ్వర ప్రతిష్టకి అంగీకరించింది. అదే కుండలేశ్వర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. మరో విశేషం కూడా ఉంది. ఇక పార్వతీదేవి ఆజ్ఞమేరకు వ్యాస మహర్షి కాశీని వదిలిపెట్టి విశ్వేశ్వరుని దర్శించుకోలేని పరిస్థితుల్లో అనేక క్షేత్రాలను దర్శిస్తూ కుండలేశ్వరం వచ్చాడు. దక్షయజ్ఞం తర్వాత యోగాగ్నిలో దగ్ధమైన సతీదేవి చెవి కుండలం పడిన ఈ క్షేత్రంలో గోదావరి స్నానం చేసి కుండలేశ్వరుని ఆయన దర్శించి కాశీవిశ్వేశ్వరుడిని దర్శించిన అనుభూతిని పొందాడు. అప్పుడు ఈ నదికి ఒక వరమిచ్చాడు. దేశంలో అన్ని నదులకు 12 ఏళ్లకు ఒకసారి పుష్కరం వస్తే, ఇక్కడ ప్రతిరోజూ పుష్కరమేనని వరం ప్రసాదించాడు. దాంతో గోదావరి పాయగా ఉన్న ఈ వృద్ధ గౌతమిలో ఏరోజు స్నానం చేసి పుష్కర స్నాన ఫలం పొందుతారు.

(ఆంధ్రజ్యోతి -కాట్రేనికోన)

దక్షిణ కాశీ..ద్రాక్షారామ



దక్షిణ కాశీగా పేరొందిన అతిప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయం. ఇది పంచారామ క్షేత్రం కూడా. రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ గ్రామంలో ఉంది. పురాణకథనం ప్రకారం దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని మథించిన సమయంలో ఆత్మలింగం ఉద్భవించింది. దీనిని తారకాసురుడు అనే రాక్షసుడు మెడలో ధరించి శివుని కోసం ఘోర తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమై దేవతలపై యుద్ధం చేయ సంభవించిన పక్షంలో తనపైగాని తన సంతతిపైగాని యుద్ధం చేయనంతవరకు అతడికి మరణం సంభవించదని వరమిస్తాడు. కాలగమనంలో దేవాసురుల సంగ్రామంలో శివుని కుమారుడు కుమారస్వామితో తారకాసురుడు తలపడతాడు. దీంతో తారకాసురుడి శిరస్సు వేయి ఖండాలుగాను, ఆత్మలింగం ఐదు ఖండాలుగాను అవుతుంది. ఆత్మలింగం శకలాల్లో ఒకటి ఇంద్రునిచే అమరావతిలో, రెండవ శకలం చందునిచే భీమవరంలో, మూడవశకలం శ్రీరామునిచే పాలకొల్లులో, నాలుగవ శకలం సామర్లకోటలో, ఐదవ శకలం ద్రాక్షారామలో సప్తమహర్షులచే ప్రతిష్ఠించే సమయానికి స్వయంభువునిగా వెలసినట్టు కథనం. పాలసముద్రం మథన సమయంలో భీమమైన హాలాహలం జనించింది. శివుడు భువనసంహారకమైన హాలాహలాన్ని మింగి కంఠాన ధరించాడు. భీమమైన కాలకూట విషం మింగి రక్షించడంతో భీమేశ్వరునిగా ఖ్యాతి చెందాడని చెబుతారు. చరిత్రపరంగా మొదటి చాళుక్య భీముని కాలంలో భీమేశ్వరాలయం 892-922 మధ్య నిర్మించినట్టు శాసనాల ద్వారా తెలుస్తోంది. చాళుక్యభీమునిచే నిర్మించిన ఆలయం భీమేశ్వరాలయంగా, భీమేశ్వరస్వామిగా పేర్కొన్నట్టు చెబుతారు. చాళుక్యభీముడు పాలించిన ప్రాంతం భీమమండలంగా ఉండేది. భీమేశ్వరస్వామి కేంద్రంగా అంతర్వేది నుంచి పట్టిసీమ వరకు భీమమండలం ఉందని, భీమమండలంలో 116 శివలింగాలు శివాలయాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇందుకు తార్కాణంగా శివలింగాలతో కూడిన భీమసభ ఆలయంలో ఉంది.

● (ఆంధ్రజ్యోతి -ద్రాక్షారామ)

కేదారేశ్వరా..



బిక్కవోలు, (ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బిక్కవోలులో తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన కేదారేశ్వరస్వామి ఆలయంలో స్వామిని మహాశివరాత్రి రోజున మాత్రమే పూజలందుకుంటాడు. 1100 ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని నిర్మించారు. పిండారీలు, మహ్మదీయుల దండయాత్రలో ఆలయాన్ని ధ్వంసం చేయగా 15 ఏళ్ల కింద నుంచి కేంద్ర పురావస్తు శాఖ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి నుంచి గ్రామస్తులు మహాశిరాత్రి రోజున స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయం ముందు దీపాలు వెలిగించడానికి అరప కూడా ఏర్పాటు చేశారు. అలాగే గురువారం మధ్యాహ్నం స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

కుమారరామ..భీమేశ్వర



సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామభీమేశ్వరుడు కూడా పంచారామ క్షేత్రాల్లో ఒకటి. ఆత్మలింగ నాలుగో శకలం ఇక్కడ పడడంతో అది గొప్ప శైవ క్షేత్రంగా పేరొందింది. కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని క్రీ.శ. 892 నుంచి 922 వరకూ తూర్పు చాళుక్య రాజుల కాలంలో నిర్మించారు. దాంతో ఇది కూడా చాళుక్య భీముడి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. శ్రీకుమార రామ భీమేశ్వరస్వామి వారి దేవేరిని ఇక్కడ శ్రీబాలాత్రిపురసుందరి అని అమ్మవారిగా పిలుస్తారు. అదేవిధంగా పురాణ కథనం ప్రకారం తారకాసురుడిని కుమారస్వామి వధించడంతో కుమార రామ భీమేశ్వరుడిగా ప్రసిద్ధి చెందినట్టు చెబుతారు.

కోటి లింగాల క్షేత్రం..



(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)

కాశీ తర్వాత అంత ప్రాముఖ్యత కలిగిన క్షేత్రంగా రాజమహేంద్రవరం ఉమాకోటిలింగేశ్వర క్షేత్రానికి పేరుంది. చారిత్రక రాజమహేంద్రవరంలో పదవ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారని చెబుతారు. పూర్వకాలంలో పరమశివుడు శివతాండవంలో శివుడు జటాజూటలో కొన్ని జటాజూటాలు రాలి గోదావరి తీరాన పడ్డాయని. అవి శివలింగాలుగా మారి కోటిలింగాలుగా అవతరించాయని పురాణ కథనం. ప్రస్తుతం కోటిలింగేశ్వరుడు కొలువై వున్న ఈ క్షేత్రంలో అంతర్ భూగర్భంలో కోటి శివలింగాలు ఉన్నాయని చెబుతారు. శ్రీరామచంద్రుడు వనవాస కాలంలో ఈ ఆలయాన్ని సందర్శించారనే చరిత్ర కూడా ఉంది. అందుకే ఈ ఆలయంలో రామాలయం కూడా ఉంది. శ్రీసీతారాములు విగ్రహాలు కూడా కొలువై పూజలు అందుకుంటాయి. ఉమాకోటిలింగేశ్వరస్వామి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్న గోదావరి రేవుకు కోటిలింగాల రేవుగా పిలుస్తారు. దేశంలో ఎక్కడెక్కడ నుంచో వచ్చి చితాభస్మాన్ని కోటిలింగాల రేవులోనే నిమజ్జనం చేస్తారు.



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారిణులు

మగువలు... మెరికలు

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటులో సత్తా చాటుతున్న మహిళలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. మహిళల విభాగంలో జరిగిన మూడు మ్యాచ్‌లను డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పర్యవేక్షించారు. సెంట్రల్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 1-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 10-2 తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్, కేరళ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో రాజస్థాన్ సెక్రటేరియట్ 2-0 తేడాతో విజయం సాధించింది.





క్రీడాకారిణుల విజయోత్సాహం



శివయ్యా... స్వాగతమయ్యా

అనపర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని అనపర్తిలోని శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ విద్యార్థి మందపల్లి శ్రీచరణ్ కుంచె నుంచి జాలువారిన శివుని చిత్రం ఆకట్టుకుంటోంది.



భక్తులకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపేందుకు రెండు రోజులు కష్టపడి కలర్ పెన్సిళ్లతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు చరణ్ మీడియాకు తెలిపాడు.



సైకత శివం మహా సందేశం

'ఆది దంపతులు శివపార్వతుల అన్యోన్యం నేటి తరానికి ఆదర్శం' నినాదంతో తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ సైకత శిల్పం రూపొందించారు. సంస్కృతి, సంప్రదాయలను కాపాడాలని కోరుతూ మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తీర్చిదిద్దిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. శిల్పి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

(ఆంధ్రజ్యోతి, రంగంపేట)

పొట్టలో పరమేశ్వరుడు



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామారావుపేటలోని ఆది గురు యోగా పీఠం వ్యవస్థాపకుడు, యోగా గురువు సద్గురు సచ్చిదానంద యోగి తన పొట్ట కండరాలను శివలింగం ఆకృతిలో మలిచి భక్తులను అబ్బురపరిచారు. యోగాలోని నౌలి క్రియ అనే భంగిమ ద్వారా భక్తిభావం చాటుకున్నారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో యోగా పీఠంలో సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్టు సచ్చిదానంద చెప్పారు.

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

» రేపు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పోలింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచార సమరం సాఫీగా ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అటు టీడీపీ నేతలు, ఇటు మిగతా పక్షాల నేతలు పట్టభద్రులను కలిసి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి నువ్వానేనా అన్నట్టుగా ప్రచారం పూర్తి చేయగలిగారు. ఇప్పటికే నిరుద్యోగం తాండ విస్తుండగా పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులంతా ప్రచారంలో చమటోడ్చారు. తమ కూటమి ప్రభుత్వం కారణంగానే పరిశ్రమలు రాబోతున్నాయని, మెగా డీఎస్సీతోపాటు యువతకు అనుకూలంగా ఉపాధి పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామనే హామీతో టీడీపీ బపలరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా రెండు విడతలుగా ముఖ్య నేతలతో భేటీ నిర్వహించారు. యువనేత నారా లోకేశ్ కూడా ఎమ్మెల్సీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఏక పక్షంగా ఉండాలనే విధంగా ఉత్సాహపరిచారు. ఉమ్మడి ఉభయగోదావరిలో విభజిత ఆరు జిల్లాలు ఉండగా వీటన్నింటిలోనూ ప్రచారంలో తెలుగుదేశం పైచేయి సాధించగలిగింది. క్షేత్రస్థాయి కేడర్ దగ్గర నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, మునిసిపల్ ఛైర్మన్‌లు, ఎంపీపీలు దగ్గర నుంచి పార్లమెంటు సభ్యుల వరకు పట్టభద్రుల చుట్టూ పరిభ్రమించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కడా పట్టు జారకుండా పక్కాగా వ్యూహాత్మకంగానే ముందుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఉన్న పట్టభద్రులను కలిశారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రచారంలో పెద్దగా పార్టీల మధ్య వివాదాలు సృష్టించే వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తలు పడ్డారు. కూటమి పక్ష ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ఓటర్ల మద్దతుకు విశ్వప్రయత్నం చేశారు.

చూసి.. ఓటేయండి

పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు పక్షాన వివిధ పార్టీల నేతలు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాన్నాళ్లైనా ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవడంలేదంటూ పట్టభద్రులకు వివరించి వారి మద్దతు పొందేందుకు ప్రయత్నించారు. శాసనమండలిలో ప్రజల పక్షాన గొంతు వినిపించేలా తమకు ఓటు వేయాలని మిగతా అభ్యర్థులు ఎవరంతట వారుగా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ సైతం వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ తన కుమారుడు జి.వి.సుందర్ పక్షాన ప్రచారం చేస్తూ టీడీపీపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వైసీపీ మాత్రం లోతట్టుగా కూటమికి వ్యతిరేకంగా ఓట్లు వేయాల్సిందిగా తమ పార్టీ అనుకూల వర్గాలను ఇప్పటికే కోరింది. మండల స్థాయిలో కొందరు జోక్యం చేసుకుని ఈ విధంగా పరోక్ష ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉన్నా ప్రచార శైలిలో మాత్రం ఎవరంతట వారుగానే వ్యవహరించారు.

ఉద్యోగ వర్గాలు ఏ వైపు?

ఈసారి పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లుగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఎవరైనా ఎన్నికల విధుల్లో ఉంటే వారికి పోస్టల్ ఓటుకు అవకాశం ఇస్తారు. మిగతా వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఇప్పటికే ఉద్యోగులంతా తమ పక్షానే ఉన్నారని కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల వరకు వెళ్లి తమ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఎలాగూ సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి పక్షానికి చెందిన వారే కావడంతో ఉద్యోగులు కూడా ఎక్కడా వ్యతిరేకత ప్రదర్శించకుండా ఇప్పటిదాకా జాగ్రత్తపడ్డారు. కూటమి ఊహిస్తున్నట్టుగా వీరందరి మద్దతు ఆ వైపే దక్కితే భారీ మెజార్టీ తథ్యమని అంచనా వేస్తున్నారు. ఇంకో వైపు కార్మికులు, ఇతర వర్గాల్లో కూడా ఈ ఎన్నిక పట్ల పెద్దగా ఆసక్తి లేకపోయినా క్షేత్రస్థాయిలో నేతల హడావుడితో పోలింగ్ కేంద్రం వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

నంబర్-1 కోసమే ఆరాటం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యత ఓటు ఒకటిగా ఎవరికి అత్యధికంగా లభిస్తుందో వారే చివరికి విజేతలవుతారు. దీంతో గడిచిన మూడు రోజులుగా ప్రాధాన్యత ఓటు ఒకటి తమకే వేయాలని, బ్యాలెట్‌లో మరెవరికీ ఈ సంఖ్యతో ఓటు వేస్తే చెల్లకుండా పోతుందంటూ మరీ ఓటర్లను చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తుండడంతో మొదటి ప్రాధాన్యత ఓటును ముందస్తుగా లెక్కిస్తారు. దీనిలో ఎవరైతే అత్యధికంగా ముందు వరుసలో ఉంటారో వారికే ఛాన్స్ దక్కడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే గడిచిన ఎన్నికల్లోను, అంతకు ముందు జరిగిన ఎన్నికల్లోను ప్రాధాన్యత ఓటు విషయంలో ఓటర్లు తడబడడంతో చెల్లని ఓట్లు వేల సంఖ్యలోనే నమోదయ్యాయి. ఒక్క 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పట్లో 13 వేలకుపైగా ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకరి కంటే మించి ఎవరికైనా నమోదు చేస్తే చెల్లదని అప్పట్లో చైతన్యపర్చకపోవడం వల్లే వేల ఓట్లు మురిగిపోయాయి. ఇప్పుడు తెలుగుదేశం దీనిని గమనించి తమ పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు బ్యాలెట్‌లో వరుస సంఖ్య ఒకటిలో ఉండడం, ఓటర్లు కూడా దీనికి అభిముఖంగా ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతో ఒకటి (సంఖ్య రూపంలో) నమోదు చేస్తే చాలంటూ ఇప్పటికే ప్రచారంలో హోరెత్తించారు. మిగతా అభ్యర్థులు కూడా తమకు ప్రాధాన్యత ఓటు ఇవ్వాల్సిందిగా పదేపదే ఓటర్లను ప్రసన్నం చేసుకునే విధంగా వ్యవహరించారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ట్రాన్స్ జెండర్	మొత్తం ఓటర్లు
అల్లూరి జిల్లా	12	2,842	1827	0	4669
కోనసీమ జిల్లా	95	37,114	27,355	2	64,471
తూ.గో. జిల్లా	92	36,361	26,606	3	62,970
ఏలూరు జిల్లా	66	24,704	17,571	7	42,282
కాకినాడ జిల్లా	98	42,463	28,072	5	70,504
ప.గో. జిల్లా	93	39,863	30,187	2	70,052
మొత్తం	456	1,83,347	1,31,618	19	3,14,984

రేపు పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్/భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని ఉపాధ్యాయులందరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఈ నెల 27న అన్ని పాఠశాలలకు ఎన్నికల సంఘం సెలవు ప్రకటించినట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా 27న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు కూడా స్థానిక సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

మద్యం విక్రయాలపై నిషేధం

కలెక్టరేట్ (కాకినాడ),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు దృష్ట్యా పోలింగ్‌కు 48గంటల ముందు నుంచి మద్యం విక్రయాలపై నిషేధం విధించారని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు, ఈమేరకు ఒకప్రకటన విడుదల చేశారు. మంగళవారం 4గంటల నుంచి గురువారం సాయంత్రం 4గంటల వరకు మద్యం దుకాణాలు తెరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మార్చి 3వ తేదీన మద్యం విక్రయాలపై నిషేధం విధించాలన్నారు. క్లబ్బులు, స్టార్ హోటల్స్ రెస్టారెంట్లు, హోటల్స్‌లో ఆయా తేదీల్లో మద్యం అమ్మకూడదని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటెయ్యండి : ఆర్వో

ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, పట్టభద్రులంతా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. పోలింగ్ కేంద్రానికి తగిన గుర్తింపు పత్రంతో వెళ్లి అధికారులకు చూపించి ఓటెయ్యాలన్నారు. ఓటరు గుర్తింపు ఉన్న పత్రంపై ఓటరు పేరు వద్ద సంతకం చేస్తే అనంతరం బ్యాలెట్ పేపర్ అందిస్తారన్నారు. ఇందులో అభ్యర్థుల పేర్లు, ఫొటోలే ఉంటాయని, ప్రాధాన్యతా క్రమంలో అధికారులు ఇచ్చిన పెన్‌తో ఓటెయ్యాలన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

పట్టభద్రుల నియోజకవర్గంలోని ఓటర్ల సౌలభ్యం నిమిత్తం హెల్ప్‌లైన్ నంబర్ 1950 లేదా 94910 41419 నంబర్లను ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్లను ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రాణాలను బలిగొన్న అతివేగం

» ధవళేశ్వరంలో ఘోర రోడ్డు ప్రమాదం

» ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక జాలరుపేటకు చెందిన నాగమళ్ళ ముత్యాలరావు (19), బొడ్డు వెంకటేష్(17) స్నేహితులు. మంగళవారం మధ్యాహ్నం 4గంటల సమయంలో బైక్‌పై కాటన్ బ్యారేజ్ వైపు నుంచి వస్తూ బ్యారేజ్ సమీపంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టెక్ చేయబోయారు. అదే సమయంలో ఎదు రుగా ఆటో వస్తుండడంతో ఆటోను తప్పించడానికి సడన్ బ్రేక్ వేసిన వేయగా బస్సు వెనుక చక్రాల కిందకు పడిపోవడంతో బస్సు కుడివైపు వెనుక చక్రం ఇద్దరు తలల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై టైర్లను వేసి నిప్పు అంటించారు. సీఐ టి.గణేష్, ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడి సముదాయించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్ర భుత్వాసుపత్రికి తరలించారు. నాగమళ్ల లక్ష్మణరావు, రాజేశ్వరి దంపతుల చిన్న కుమారుడు ముత్యాలరావు. 7వ తరగతి వరకు చదివి తండ్రికి చేపల వేటలో చేదోడువాదోడుగా ఉంటున్నా డు. ఎదిగి వచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లాడంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యా రు. కాగా వెంకటేష్‌కు తండ్రి వీరబాబు, ఓ అన్నయ్య, అక్క ఉన్నారు. తమ్ముడిని కోల్పోవడంతో వారి రోదన వర్ణనాతీతం. ఇద్దరు స్నేహితుల మృతితో జాలరిపేటలో విషాదయఛాయలు అలుముకున్నాయి



సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు



ముత్యాలరావు (ఫైల్‌ఫొటో)



వెంకటేష్(ఫైల్)

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధవళేశ్వరం చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారిని ఓదార్చి కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

రాగిజావ తాగి..
14 మంది విద్యార్థులకు అస్వస్థత

ఏరియా ఆసుపత్రికి తరలింపు

సమాచారం ఇవ్వలేదని

ఎంఈవో, తల్లిదండ్రుల ఆగ్రహం



అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం/అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చల్లపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గరాజుపేట ప్రాథమిక పాఠశాలలో కలుషిత ఆహారం తిని 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు పులిదిండి సుజాత అందజేసిన రాగిజావను తాగిన విద్యార్థులు తొలుత స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. అనంతరం 12.10 గంటలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా పులిహోర, దొండకాయ కూర కలిపి తిన్నారు. అప్పటికే రాగిజావ తాగిన 28 మంది విద్యార్థుల్లో 14 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. 5వ తరగతి చదువుతున్న మాదే అభిలాష్ వరుసగా 12 పర్యాయాలు వాంతులు చేసుకుని నీరసించి పోయాడు. పరిస్థితిని గుర్తించిన పాఠశాల హెచ్‌ఎం పి.వరలక్ష్మి అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితిని ఎస్.యానాం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తెలియచేశారు. వెంటనే వైద్యాధికారిణి డాక్టర్ లోవసుధ అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి వారిని ఉన్నత వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరముబాబు, పీఎంసీ ఛైర్మన్ మార్కండేయులు దగ్గరుండి విద్యార్థులకు సేవలందించారు. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదంటూ ఎంఈవో సత్తి సత్యకృష్ణ, తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు రాగిజావ, పులిహోర, పచ్చడి తయారుచేసి పని ఉందని వెళ్లిపోయిన తీరుపై తల్లిదండ్రులు మండిపడ్డారు.

విద్యార్థులకు వైద్య సేవలు

రాగిజావ తాగి అస్వస్థతకు గురైన విద్యార్థులను హుటాహుటీన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో 2వ తరగతి చదువుతున్న నాతి దినేష్, దాసరి రోషన్‌తేజ్, మూడో తరగతి చదువుతున్న పోతుల అర్జున్, పెట్టా లక్కీ, బడుగు హారిక, మాదే నైనిష, మద్దెల ధనుష్, 4వ తరగతి చదువుతున్న పోతుల సుధాకర్, పోతుల సుహాసిని, మద్దెల రేణుక, 5వ తరగతి చదువుతున్న సాకా భార్గవకుమార్, మాదే దుర్గాశ్రీ, మాదే అభిలాష్, రొక్కాల నాగసత్యలకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. సమాచారం అందుకున్న అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్లు వాసా ఎస్.దివాకర్, పలివెల అశోక్‌ప్రసాద్ ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న సమాచారంతో తల్లిదండ్రులతో పాటు బంధువర్గీయులు, స్థానికులు అధిక సంఖ్యలో ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలమూరి మోహన్‌బాబు పరామర్శించారు.

ఆరోగ్యం మెరుగుపడింది : డీఈవో

అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఇతర ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సాయంత్రానికి ఏడుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగు పడడంతో డిశ్చార్జి చేశారు. మరో ఏడుగురు విద్యార్థులు వైద్యుల సంరక్షణలో చికిత్స పొందుతూ రాత్రికి డిశ్చార్జి చేయనున్నట్టు డాక్టర్ శంకరరావు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలిని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు తొలగించినట్టు డీఈవో తెలిపారు.



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందరావు

మారుతున్న రత్నగిరి రూపురేఖలు

అన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం ఆఖరిస్థానం రావడం పరిస్థితులు మెరుగు కోసం ప్రభుత్వ పెద్దల సూచనతో సోమవారం స్వీయపర్యవేక్షణ చేయడంతో క్రమేపీ రూపురేఖలు మారుతున్నాయి. ముందుగా గతకొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న హరిహరసదన్ కాటేజీ పక్కనే ఉన్న మరుగుదొడ్లను శానిటేషన్ సిబ్బంది శుభ్రపరిచారు. సీఆర్వో కార్యాలయం వద్ద నగదురహిత సేవలను మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు వేచిఉండకుండా బఫే విధానం అమలుచేయాలనే కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈవో వీర్ల సుబ్బారావు ప్రస్తుత భవన పైఅంతస్తు పరిశీలించి త్వరితగతిన అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు సెక్యూరిటీ విభాగం సూపరింటెండెంట్ ఐవీ రామారావు సెక్యూరిటీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రోటోకాల్ పరిధిలో ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక క్యూ ద్వారా పంపించాలని, కిందిస్థాయి సిబ్బందిఎవ్వరు తీసుకొచ్చిన తూర్పురాజగోపురం నుంచే పంపించాలని అడ్డదిడ్డంగా పంపకుండా చూడాలని ఆదేశించారు.



మరుగుదొడ్లను శుభ్రపరుస్తున్న శానిటేషన్ సిబ్బంది

నేడు సరస్వతీ పూజ

త్వరలో జరిగే ఇంటర్, పదవ తరగతి, ఇతర ముఖ్య పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలనే ఆకాంక్షతో బుధవారం అన్నవరం దేవస్థానంలో సరస్వతీ పూజ నిర్వహించనున్నట్టు ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణమండపంలో జరిగే ఈ కార్యక్రమంలో సరస్వతీపూజ అనంతరం స్వా మిచెంతన ఉంచిన కలములు ఉచితంగా బహూకరించనున్నారు. అనంతరం వారికి సత్యదేవుడి ప్రత్యేకదర్శనం, అన్నదాన విభాగంలో ఉచిత అన్నప్రసాద సౌకర్యం కల్పించామని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంటు

● ముస్తాబైన గొల్లవిల్లి క్రీడాప్రాంగణం ● ఫ్లడ్ లైట్లవెలుగుల్లో మ్యాచ్‌లు

● ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆరు పురుషులు, మూడు మహిళా టీమ్‌లు రాక



వాలీబాల్ పోటీలకు సిద్ధం చేసిన గొల్లవిల్లి క్రీడా మైదానం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అరిగెల శ్రీరంగయ్య నేషనల్ వాలీబాల్ పోటీలకు కోనసీమ జిల్లాలోని గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం ముస్తాబయ్యింది. ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు టోర్నమెంటు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆరు పురుషుల, మూడు మహిళా టీమ్‌లు పాల్గొననున్నాయ. 1988 నుంచి వాలీబాల్ పోటీల నిర్వహణలో అంచెలంచెలుగా ఎదిగిన గొల్లవిల్లి వాలీబాల్ క్రీడా మైదానం జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్ల ప్రశంసలు అందుకుంది. ఆటగాళ్ల ప్రాక్టీసు నిమిత్తం ప్రత్యేక కోర్టును గతంలోనే ఏర్పాటు చేశారు. ఇప్పటికే గొల్లవిల్లి వాలీబాల్ కోర్టును రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ పరిశీలించడం జరిగింది. నాలుగు వేల మంది ప్రేక్షకులకు సరిపడే గ్యాలరీలు నిర్మించారు. మహిళలకు ప్రత్యేక గ్యాలరీ నిర్మించారు. వీఐపీలకు ప్రత్యేక వేదిక ఉంది. వాహనాలకు రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ సీహెచ్ రాజేష్ క్రీడా ప్రాంగణానికి రాకపోకలకు ప్రత్యేక మార్గాలను నిర్దేశిస్తూ రూట్ మ్యాప్ రూపొందించారు. క్రీడాప్రాంగణంలో శాంతిభద్రతల ఏర్పాట్లపై టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, సాంకేతిక సలహాదారు వుండ్రు రాజబాబుతో చర్చించారు.

యువత చెమటోడుస్తున్నారు

టోర్నమెంటు అధ్యక్షుడు,
దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ

గొల్లవిల్లి వాలీబాల్ క్రీడా వేదిక వెలుగులు నలుమూలలా ప్రసరింప చెయ్యాలన్న లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సహకారంతో అరిగెల శ్రీరంగయ్య నేషనల్ టోర్నమెంటును ప్రారంభించాం. గొల్లవిల్లి వాలీబాల్ క్లబ్ యువతతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి యువత ఈ టోర్నమెంటు నిర్వహణకు చెమటోడుస్తున్నారు.

తృతీయస్థానంలో గొల్లవిల్లి

గొలకోటి ఫణీంద్రకుమార్, పీడీ,
టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి

నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహణలో గొల్లవిల్లి క్రీడా వేదిక ప్రస్తుతం దేశంలో మూడవ స్థానంలో ఉంది. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో గొల్లవిల్లి టోర్నమెంటు రిజిస్ట్రేషన్ జరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలు లీగ్ పద్ధతిలో జరుగుతాయి.

వివాహిత అనుమానాస్పద మృతి

ఎటపాక ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద రీతిలో వివాహిత మృతి చెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం టీపీవీడు పంచాయతీలోని సీతాపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిప్రియ (27) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నితో ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. అప్పుడే ఇంటికి వచ్చిన భర్త నాగభూషణం భార్యని చూసి వెంటనే మెడకు ఉన్న ఉరితాడు తీసి కిందకు దింపాడు. ఇరుపొరుగు వారిని పిలిచేలోపు అప్పటికే ఆమె మృతిచెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ అప్పలరాజు సంఘటనా ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. వివాహిత తల్లిదండ్రులు, భర్త, మామను విచారించారు. అయితే ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యుల వేధింపులతోనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. కాగా ఆరేళ్ల క్రితం సాయిప్రియకు వివాహామైంది. ఆమెది తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం. పోలీసులు పోస్టుమార్టం అనంతరం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ అప్పలరాజు

ప్రేమ పేరుతో గర్భవతిని చేసిన వ్యక్తికి
పదేళ్ల జైలు శిక్ష, జరిమానా

అడ్డతీగల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని నమ్మించి గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి పది సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించిన సంఘటన గంగవరం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అడ్డతీగల సర్కిల్ పరిధిలోని గంగవరం మండలం పాత రాయవరం గ్రామానికి చెందిన గూడేం. రాయుడు అనే యువకుడు అదే గ్రామానికి చేందిన యువతిని ప్రలోభపెట్టి ప్రేమిస్తున్నానని నమ్మబలికి ఆమెను గర్భవతిని చేశాడు. వివాహం చేసుకోవాలని యువతి అనేక పర్యాయాలు ప్రాధేయపడిన ఫలితం లేకపోవడంతో గంగవరం పోలీస్‌స్టేషన్‌లో 2023లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. అప్పటి అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని రాజమండ్రి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆ కేసు మంగళవారం తుది విచారణకు రావడంతో నేరం రుజువు కావడంతో నిందితుడికి రాజమండ్రి 8వ అడిషనల్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య పదేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని అడ్డతీగల సీఐ నర్సింహమూర్తి తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

నక్కపల్లి, (అనకాపల్లి జిల్లా) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బి.శ్యామ్‌ప్రసాద్(28) నక్కపల్లి మండలం వేంపాడు వద్ద ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు ఎస్.సాయిబాబుతో కలిసి హెటిరో కంపెనీలో పనిచేస్తున్న మరో స్నేహితుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరారు. వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఓ లారీని తప్పించబోయి ఆగి ఉన్న మరో లారీని ఢీ కొన్నారు. దీంతో శ్యామ్‌ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయిబాబుకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై నక్కపల్లి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్యామ్‌ప్రసాద్ (ఫైల్ ఫొటో)

నేడు అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు సెలవు

ఆలమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి జాతీయ రహదారిపై ఉన్న అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా సెలవు ప్రకటించారు. వ్యాపారులు, రైతులు గుర్తించి మార్కెట్‌కు కూరగాయలు తీసుకురావద్దని సూచించారు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీపీఎం బదిలీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీపీఎం, డీఎం డి.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ఆయనను విజయనగరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి మంగళవారం జీవో నంబర్ 408 జారీ చేశారు.

కనులపండువగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



దుర్గాడలో ప్రత్యేక అలంకారంలో రామలింగేశ్వరస్వామి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను అలంకరించి ప్రత్యేకంగా వేదికపై ఉంచి కల్యాణం జరిపించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా శివలింగాలు

గొల్లప్రోలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన శివలింగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంగళవారం బ్రహ్మకుమారీలు పుష్పాలతో చేసిన శివలింగాన్ని, రాజస్థాన్ నుంచి తీసుకువచ్చిన శ్వేతవర్ణ శివలింగాన్ని భక్తుల దర్శనార్థం ఉంచారు. శ్వేతవర్ణ శివలింగాన్ని ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేశారు.



గొల్లప్రోలులో శివలింగం

మత్స్యకారుడు గల్లంతు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన బొడ్డు రమణ (59) చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటాడు. ఈ నెల 8న సోనా బోటులో సహచరులతో కలిసి వేటకు వెళ్లి 14 రోజుల అనంతరం తిరుగు పయనమయ్యారు. ఈ నెల 22న బోటు యజమాని కాసారపు పైడిరాజు రమణ భార్య లక్ష్మికి ఫోన్ చేసి రమణ కాకినాడ కుంభాభిషేకం సమీపంలో బోటు నుంచి ప్రమాదవశాత్తు జారి సముద్రంలో పడిపోయాడని చెప్పాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు బంధువుల సహాయంతో సముద్రంలో గాలించిన ప్రయోజనం లేకపోయింది. లక్ష్మి మంగళవారం పోర్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

2న యానాంలో హేతువాద జనజాగృతి సభ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 2వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు యానాం గోపాలనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విజ్ఞాన్ భవన్‌లో హేతువాద సంఘం జనజాగృతి సభ ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీ ఆర్టీఐ జేఏసీ అధ్యక్షుడు పప్పు దుర్గారమేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సభకు యానాం సివిల్ రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పొనుమట్ల విష్ణుమూర్తి అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య వక్తలుగా భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకట సుబ్బయ్య, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, మాజీ పార్లమెంట్ సభ్యులు పండుల రవీంద్రబాబు ప్రసంగిస్తారన్నారు. పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు మొగల్ కాలేషా బేగ్ కోరారు.

'బాల్యారంభ శిశువుల మేధోవికాసానికి ప్రాధాన్యం'

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బాల్యారంభ శిశువుల మేధోవికాసానికి ప్రాధాన్యమిస్తూ ఆటలు ఆధారిత అభ్యసనప్రక్రియలను అన్వయించుకుని బోధన సాగించాలని సమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరరావు సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలంలోని 77 మంది అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి రెండు విడతల ఆరురోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎంఈవో 2 వెంకట శివప్రసాద్, రిసోర్స్‌పెర్సన్లు మేడసాని సత్యనారాయణ, అనిశెట్టి సీతారామరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి,మానసాదేవి పాల్గొన్నారు.

పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక మెక్లారిన్ హైస్కూల్‌లో భద్రపరచిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను మంగళవారం కాకినాడ ఆర్డీవో మల్లిబాబు అధికారులతో కలిసి పరిశీలించారు. అర్బన్ తహశీల్దార్ వజ్రపు జితేంద్ర, డిప్యూటీ తహశీల్దార్ గోవిందరాజులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, మాచారావు కృష్ణకుమారి, సిబ్బంది ఉన్నారు.

పెద్దాపురం: ఎన్నిక ప్రక్రియకు సంబంధించి పోలింగ్ సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఈనెల 26న పెద్దాపురం ఆర్డీవో కార్యాలయంలో జరుగుతుందని ఆర్డీవో కె.శ్రీరమణి తెలిపారు. ఏర్పాట్లను ఆమె మంగళవారం పరిశీలించారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలని ఆమె కోరారు.

మహా శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

●పాదగయంలో పటిష్టంగా బారీకేడ్లు నిర్మాణం ● తాత్కాలిక మరుగుదొడ్లు, కుళాయిలు ● 24మంది గజ ఈతగాళ్లు

పిఠాపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇటీవల పలు ప్రాంతాల్లో చోటు చేసుకున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఎన్నటు లేని విధంగా జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎస్పీ బిందుమాధవ్, పాడా పీడీ శ్రీధర్, దేవాదాయశాఖ సంయుక్త కమిషనరు సుబ్బారావు స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించడంతో పాటు భక్తుల భద్రత, సౌకర్యాలు లక్ష్యంగా పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీని తట్టుకునేందుకు వీలుగా ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనాల కోసం 2 క్యూలైన్లు ఏర్పాటు చేయగా, రూ.20,50 దర్శనాల కోసం నిర్ణీత సమయాల్లోనే (మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకూ)వీఐపీ దర్శనాలు ఉండేలా చూస్తూ సామాన్య భక్తుల దర్శనానికి ప్రాధాన్యం ఇచ్చే విధంగా చర్యలు చేపట్టారు. పాదగయ పుష్కరిణిలో స్నానాలు అచరించిన అనంతరం భక్తులందరికీ దర్శనమయ్యేలా క్యూలైన్లు నిర్మించారు. పుష్కరిణి వద్ద నుంచి స్నానాలకు వెళ్లే భక్తులకు ఎండతీవ్రత నుంచి రక్షణకు గానూ చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. పుష్కరిణి వద్ద విపత్కర పరిస్థితి ఏర్పడినా ఎదుర్కొనేందుకు వీలుగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. ఉత్సవాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టారు.



పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద బైపాస్‌రోడ్డు నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్లు

పెద్దఎత్తున బందోబస్తు

సామర్లకోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం వద్ద పెద్దఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ వెల్లడించారు. ఏర్పాట్లను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మంగళవారం రాత్రి పరిశీలించారు. గోదావరి పుష్కరిణి వద్ద ఏర్పాటుచేసిన ఆదియోగి విగ్రహన్ని పరిశీ లించారు. అవాంఛనీయ సంఘటనలు లేకుండా భక్తులకు సేవలందివ్వాలనిఅధికారులను ఆదేశించారు.

పటిష్ట ఏర్పాట్లు : ఎస్పీ

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పిఠాపురం, సామర్లకోట శివాలయాల్లో భక్తుల రద్దీ పోటెత్తనున్న నేపథ్యంలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జి.బిందుమాధవ్ మంగళవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇతర ముఖ్య దేవాలయాల్లో కూడా బందోబస్తు ఏర్పాట్లు చేసామన్నారు. భక్తుల రద్దీ, భద్రత, ట్రాఫిక్ నియంత్రణలపై పోలీస్‌శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్‌లు 100 లేదా 112 అలాగే జిల్లా ఎస్పీ వాట్సాప్ హెల్ప్ లైన్ నెంబర్ 9494933233 లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు.

కుక్కుటేశుని గ్రామోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీసమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. కళ్యాణం అనంతరం నిర్వహించే ప్రధాన ప్రవేశ తాళిపాక శేషహోమాన్ని నిర్వహించారు. రాజరాజేశ్వరీదేవికి సహస్ర చామంతి పూజ జరిగింది. రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను, కుక్కుటేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాల్లో ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ ప్రసాదరావు, సూపరింటెండెంట్ వీరభద్రరావు, ఆలయ మాజీ చైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్, సూరవరపు సురేష్, ఓలేటి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

చికెన్ మేళాకు ఎగబడ్డ జనం



మేళాకు తరలివచ్చిన జనం

పెద్దాపురం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్థానిక రాజుగారి వీధిలో నిర్వహించిన ఉచిత చికెన్ మేళాకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో అందరికీ చికెన్ అందించలేక నిర్వాహకులు చేతులెత్తేశారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లో నెలకొని ఉన్న అపోహలను తొలిగించేందుకు ఈమేళాను పట్టణానికి చెందిన శ్రీనివాసా చికెన్ దుకాణం ఈ మేళాను నిర్వహించారు. ప్రజలు అధికంగా తరలిరావడంతో నిర్వాహకులు అయోమయానికి గురయ్యారు.

20 మోటార్ సైకిళ్లు సీజ్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ తెలిపారు. మహాలక్ష్మీనగర్, ప్రదీప్‌నగర్, పగడాలపేటల్లో తనిఖీలు నిర్వహించి రికార్డుల్లేని 20 మోటార్ సైకిళ్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సెర్చ్‌లో ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, ఎస్ఐలు వీరబాబు, సత్యనారాయణ, మూర్తిప్రసాద్ పాల్గొన్నారు.

'సెలవు ప్రకటించాలి'

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే వారిలో అధిక శాతం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నందున ఈ నెల 27వ తేదీ పోలింగ్ రోజున అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఎస్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోర్త శ్రీనివాస్ కోరారు. ఎస్టీయూ జిల్లా ప్రతినిధులు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి

కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించడంతోపాటు రానున్న ఖరీఫ్ 2025 సీజన్ అవసరమైన కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. జిల్లావ్యవసాయ శాఖ ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో వ్యవసాయం, ఉద్యాన, ఏపీఎంఐపీ తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజువారి వ్యవసాయ కార్యకలాపాలలో భాగంగా విచక్షణ రహితంగా వాడుతున్న విషపూరిత రసాయనాలు, పురుగు మందులతో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల తీవ్రమైన అనారోగాలు బారిన పడుతున్నామని దీని తోడు వాతావరణ మార్పులు కూడా అనేక దుష్పరిణామలకు కారణం అవుతుందన్నారు. పోషకాలతో కూడిన వరి, కూరగాయలు, పండ్లు, ఇతర చిరుధాన్యాలను ప్రకృతి వ్యవసాయ పద్దతుల కింద సాగు చేసేలా రైతులకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం కింద పంటలు పండించే విధానం, సేంద్రియ ఎరువుల తయారీ, పంటలకు వచ్చే తెగుళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పుస్తకాలను ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎలియాజర్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్ కుమార్, డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ ఏడీ మల్లికార్జునరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు

వసతి గృహాల్లో సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమం ఇతర వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సాంఘిక సంక్షేమం, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కాకినాడ జగన్నాథపురం చర్చి స్క్వేర్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల కళాశాల వసతి గృహం, అన్నవరం సత్యనారాయణ డిగ్రీ కళాశాలలోని బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతి గృహంలోని తాగునీరు, భోజనం, ఇతర వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లోని సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి సంబంధించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ జి.శ్రీనివాసరావు, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ వెంకటరాజు, అన్నవరం సత్యనారాయణ డిగ్రీ కాలేజీ సిబ్బంది ఉన్నారు.

వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం మంగవారం వాడివేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన ఈసమావేశం జరిగింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ మంచి నీటి సరఫరాకు సంబంధించి సామర్లకోటలో 11మోటార్లు ఉండగా కేవలం మూడు మోటార్ల మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. మిగిలిన మోటార్లను మరమ్మతుల పేరుతో ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పెడుతున్నారే తప్ప ఎక్కడా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. పట్టణ పరిధిలో బూస్టర్ పాయింట్, మరో ట్యాంక్ వద్ద మోటార్, జనరేటర్ రిపేరులో ఉన్నా బిల్లులు చేసుకుంటున్నారే తప్ప ప్రజల అవసరాలను పట్టించుకోకుండా ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటోందన్నారు. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, సత్తిబాబు మాట్లాడుతూ వారపుసంత జరిగే ప్రదేశంలో చిరువ్యాపారులు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలను సాగించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. కౌన్సిలర్ పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్ చేయించాలన్నారు. కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవరావు మాట్లాడుతూ సిబ్బందిని నియమించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన ఉన్న సమస్యలపై కౌన్సిల్లో ప్రస్తావించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మేనేజర్ జ్యోతీరాణీ, ఆర్వో చంద్రశేఖర్, శానిటరీ ఇనస్పెక్టర్ ఆదినారాయణ, డీఈ ప్రకాశరావు, ఏఈ జీవప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశం దృశ్యం

కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించేందుకు పట్టభద్రులు సిద్ధం

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని గెలిపించడానికి పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారని ఎన్టీఆర్ వైద్యసేవ, శెట్టిబలిజ కార్పొరేషన్ల చైర్మన్లు సీతం రాజు సుధాకర్, కుడుపూడి సత్తిబాబు, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తిలు అన్నారు. మంగళవారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ 30మంది ఓటర్లకు ఓ ఇన్‌చార్జిని వేశామని, పోలింగ్ రోజున ఓటర్లంతా ఓటువినియోగించుకునేలా సహకారం అందిస్తారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రాందేవు సీతయ్యదొర, బొజ్జ భవాని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సత్యనారాయణమూర్తి, కుడుపూడి సత్తిబాబు, సుధాకర్

కూటమి అభ్యర్థిని గెలిపించండి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ దారపురెడ్డి జగదీష్ కోరారు. వన్నెపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించి పేరాబత్తులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్ పాల్గొన్నారు.

పనసపాడులో ఎన్నికల ప్రచారం

సామర్లకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజ శేఖరం గెలుపు కోరుతూ పనస పాడులో మంగళవారం గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. పలువురు గ్రాడ్యుయేట్లను, సచివాలయాల సిబ్బందిని, పంచాయతీ సిబ్బందిని వెంకటేష్, నాయ కులు, కార్యకర్తలు కలిసి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని కోరారు.

పలుచోట్ల ఎన్నికల ప్రచారం

రాజశేఖర్‌కి మద్దతు ఇవ్వాలి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగ పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతు ఇచ్చి, అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ జడ్పీటీసీ, ఎన్నికల అబ్జర్వర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు కోరారు. మంగళవారం సర్పవరం, రమణయ్యపేట, గైగోలుపాడు ప్రాంతాల్లో పర్యటించి మొదటి ప్రాధాన్యతా ఓటు ఒకటి అంకె రాజశేఖర్‌కి వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. పార్టీ నాయకులు ఎం గంగయ్య, పాలిక శ్రీను, పంపన మహేష్, పాలిక నాగరాజు, గీసాల వెంకటేశ్వరరావు, పూసల ఏసు పాల్గొన్నారు.

జగన్‌కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో వైసీపీ పార్టీ మాత్రమే ప్రతిపక్షంలో ఉందని, అందుచేత మాజీ సీఎం జగన్‌కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వైద్యనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌కి ప్రతిపక్ష నాయకుడు హోదా ఇస్తే ప్రజల గొంతుక వినిపిస్తారనే భయంతో అడ్డుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. 9నెలల్లో 1.19లక్షల కోట్లు అప్పు చేశారని, ఈడబ్బులు ఎక్కడెక్కడ ఖర్చుచేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ గోపిశెట్టి పద్మజబాబ్జి, పార్టీ నాయకులు వరసాల జాన్‌ప్రభాకర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ ఆకస్మిక తనిఖీలు

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లోని పలు విభాగాల్లో హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రోగులకు అందుతున్న సేవలు గురించి రోగులు, వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో పారిశుధ్యం సక్రమంగా ఉందా లేదా, ఆసుపత్రిలో పెడుతున్న భోజనం సరైన పరిమాణంలో నాణ్యతతో ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సూపరిండెంట్లు డా. ఎంపిఆర్ విఠల్, డా. పి.శ్రీనివాసన్, గైనిక్ హెచ్‌వోడి డా. అనురాగమయి, నర్సింగ్ సూపరిండెంట్ పాల్గొన్నారు.

పురాతన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడదాం

గొల్లప్రోలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పురాతన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. ఇందుకు నిదర్శనంగా ఉన్న భజన సమాజాలు, కళాకారులను గౌరవించి, ప్రోత్సహించాలని వారు సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని శివాలయంలో జరుగుతున్న ఉమారామలింగేశ్వర సాయి దుర్గా 20వ సప్తాహ మహోత్సవాల్లో భాగంగా కోనసీమ భజన కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడు, గ్లోబల్ పీస్ అంబాసిడర్-2022 పురస్కార గ్రహీత కుంపట్ల బాపన్ననాయుడిని భజన సమాజాల సభ్యులు, శిష్యబృందం ఘనంగా సత్కరించారు. నవవిధ భాగవతోత్తమ సేవల్లో భజన ప్రశస్త్యమైనదని తెలిపిన బాపన్ననాయుడిని సత్యసాయి శివపంచాయతన క్షేత్రం గురువులు స్వామి సూర్యనంద సప్త సప్తాహ సార్వభౌమ బిరుదుతో సత్కరించారు. కోనసీమ, కాకినాడ జిల్లా భజన కళాకారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో లేగదూడల ప్రదర్శన

కొత్తపల్లి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపురంలో పశుగణాభివృద్ధి సంస్థ-పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ముమ్మిడివారిపోడుకు చెందిన సుమారు 40 మంది పాడిరైతులు లేగదూడలను ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న మంచి ఆరోగ్యకరంగా ఉన్న మూడు లేగదూడలను ఎంపిక చేశారు. ప్రథమ బహుమతిని పిర్ల గంగాధర్, ద్వితీయ బహుమతిని బండి వెంకటరమణ, తృతీయ బహుమతిని ముమ్మిడి వెంకటరమణలు పొందారు. వీరికి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ టీఎస్ రమేష్‌చంద్ర బహుమతులను అందజేశారు. నాగులాపల్లి, కొత్తపల్లి పశువైద్యులు డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ శ్రీమన్నారాయణ, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటు, తొలగింపుపై వివాదం

భోగాపురంలో ఉద్రిక్తత

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): భోగాపురంలో విగ్రహం ఏర్పాటు, తొలగింపుపై మంగళవారం ఏర్పడిన వివాదం ఉద్రిక్తతలకు దారి తీసింది. గ్రామంలో 56గజాల స్థలంలో కొత్తపేట కాలనీ వాసులు వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. అయితే తన స్థలంలో విగ్రహం ఎలా ఏర్పాటు చేస్తారంటూ గంగాధరరావు అభ్యంతరం వ్యక్తం చేసి జేసీబీతో విగ్రహాన్ని తొలగించారు. దీనితో కొత్తపేట కాలనీ వాసులు, వీహెచ్‌పీ నాయకులు అక్కడకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. దీనితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పిఠాపురం రూరల్ ఎస్ఐ గుణశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రాజశేఖర్‌కు ఓటు వేయాలని ప్రచారం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని 108 పోలింగ్ బూత్ ఇన్‌చార్జి గాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించారు. మంగళవారం స్థానిక సాంబమూర్తినగర్ తదితర ప్రాంతాల్లో పట్టభద్రుల ఓటర్లకు కలిసి కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక 36వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు మంగళవారం డివిజన్‌లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి కరపత్రాలు పంచి ఓట్లు అభ్యర్థించారు. డివిజన్ మహిళా నాయకురాలు నల్లూరి తులసి, టీడీపీ నాయకులు ఉప్పులూరి వీరభద్రరావు పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

సామర్లకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య సిబ్బంది ధర్నా నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న పారిశుధ్య కార్మికుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని, పీహెచ్‌సీ సిబ్బందిని డ్రైవింగ్ పనులకు నియమిస్తే తదుపరి జరిగే ప్రమాదాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాలని నినాదాలిచ్చారు. అనంతరం వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్యకు అందజేశారు. ఈధర్నాకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్య క్షుడు తాటిపాక మధు నాయకత్వం వహించారు. ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సామర్లకోట శాఖ యూనియన్ నాయకులు కిశోర్, బి.శ్రీను, మల్లిపూడి లక్ష్మి, వరలక్ష్మి, అజ్జమ్మ పలువురు పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ధర్నాతో పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాలకు నిర్వహించాల్సిన ప్రత్యేక పారిశుధ్య పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జ్ఞానజ్యోతి శిక్షణా తరగతులు ముగింపు

సామర్లకోట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న రీతిలో చిన్నారులకు ఆటలు, పాటలతో కూడిన విద్యాబోధన చేసేందుకు సామర్లకోట పట్టణం అయోధ్య రామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఉండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు రోజులు చేపట్టిన శిక్షణా తరగతులు మంగళవారంతో విజయవంతంగా ముగిసాయి. సామర్లకోటలో ఎంఈవో వై.శివరామకృష్ణయ్య, ఉండూరులో ఎంఈవో-2 పట్టపగలు పుల్లయ్య ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు రెండు బ్యాచ్‌లోగా 150మందికి శిక్షణ ఇచ్చారు. విద్యాబోధనలో మెళకువలు, లెర్నింగ్ మెటీరియల్‌తో విద్యాబోధన తదితర అంశాలపై టీవోటీలు సమగ్రంగా వివరించారు. మంగళవారం సాయంత్రం సీడీపీవో జి.ఉషా నేతృత్వంలో శిక్షణ పొందిన అంగన్‌వాడీలకు గ్రాడ్యుయేషన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆరు రోజులు ఆయా సబ్జెక్ట్స్‌లో నిపుణులైన టీవోటీలు అందించిన శిక్షణతో క్షేత్రస్థాయిలో విద్యాబోధన చేసి మంచి ఫలితాలు సాధించాలని ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పుల్లయ్య సూచించారు.

గ్రూప్-2లో మోసపోయిన విద్యార్థులకు అండగా ఉంటా: సుందర్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 నోటిఫికేషన్ రోస్టర్‌లో అనేక లోపాలున్నాయని చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ఏపీపీఎస్సీని బలిపశువును చేసి పరీక్ష నిర్వహించిందని, ఈనోటిఫికేషన్ ద్వారా మోసపోయిన విద్యార్థులకు తాను అండగా ఉంటానని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్ పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలోని దంటు కళాక్షేత్రంలో గ్రూప్-2 పరీక్షలో మోసపోయిన విద్యార్థులతో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సుందర్ మాట్లాడారు. ఈనోటిఫికేషన్, నిర్వహించిన పరీక్ష రద్దు చేయాలని రెండు వేల మంది విద్యార్థులతో రిట్ పిటిషన్ వేయిస్తున్నామన్నారు. సదస్సులో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పూల్ క్యాంపస్ డ్రైవ్

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ఐఐఐపీటీ డైరెక్టర్ డాక్టర్ బీటీ కృష్ణ ఫార్మసీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ,బీఎస్సీ ,ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన ఆఖరి సంవత్సర పురుష విద్యార్థులకు దివీస్ లేబొరేటరీస్ కంపెనీ మంగళవారం పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈసందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్‌ను దివీస్ ప్రతినిధులు, వర్సిటీ అధికారులు వీసీ చాంబర్‌లో కలిసారు. ఉపకులపతి మాట్లాడుతూ పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ ప్లాంట్లలో ఉద్యోగాలిస్తామన్నారు. 110మంది ఇంటర్వ్యూలకు రిజిస్ట్రేషన్ చేసుకోగా 60మంది హాజరైనట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ తెలిపారు. వారిలో 38మంది ఫైనల్ రౌండుకు ఎంపికకాగా వారందరికీ త్వరలో హెచ్‌ఆర్ ఇంట ర్వ్యూలు నిర్వహిస్తామని కంపెనీ హెచ్ఆర్ మేనేజర్లు శరత్, రామకృష్ణ తెలుపగా కార్యక్రమంలో డైరెక్టర్ పద్మప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం

జగ్గంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహించారు. రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, గేన శివ, గంధం శ్రీనివాస్, మొగిలి గంగాధర్, మండపాక బాపన్నదొర, గనుకుల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



జగ్గంపేట మండలం ఇర్రిపాకలో...



కిర్లంపూడి మండలం తామరాడలో...

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు

జగ్గంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలో ఏలేరు నదీ తీరాన శివకేశవుల ఆలయం వద్ద అభివృద్ధి కమిటీ చైర్మన్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో మహా శివరాత్రికి విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు. భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయం అన్ని హంగులు సంతరించుకుంది. తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకం, బిల్వార్చన, అభిషేకం, అఖండ హారతి, సర్వదర్శనం, సాయంత్రం భ్రమరాంబిక-మల్లికార్జునుల కల్యాణోత్సవం, లింగోద్భవ పూజలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరాడలో ఆర్ఎస్ఎస్ సభ్యుడు తోట రామగోపాలకృష్ణ ఆధ్వర్యంలో భవానీ శంకరస్వామిగా వెలసిన అష్టదళ పద్మశివలింగాన్ని ముస్తాబు చేస్తున్నారు. పాలెం గ్రామంలో సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని ధర్మకర్త భమిడిపాటి శ్రీరాంప్రసాద్ ఆధ్వర్యంలో, భూపాలపట్నంలో పర్వతవర్ధినీ సమేత పంచాయతన రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రికి ఏర్పాట్లు చేశారు. సోమవరం, కృష్ణవరం, పాలెం, భూపాలపట్నం రేవులను, క్యూలైన్ల వద్ద భద్రతా ఏర్పాట్లను తహసీల్దారు చిరంజీవి, ఎంపీడీవో హరికృష్ణ, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ పరిశీలించారు. రేవుల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని కమి టీ సభ్యులకు సూచించారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలేశ్వరం, సిరిపురం, లింగంపర్తి గ్రామాల్లో మహా శివరాత్రికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏలేశ్వరంలో రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఏజెన్సీ పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏలేరు నదీ తీరాన బ్రాహ్మణరేవు స్నానఘట్టం వద్ద మహిళల కోసం ప్రత్యేక గుడారాలు, విద్యుద్దీపాలు, బారికేడ్ల నిర్మాణంతో క్యూలైన్లు నిర్మించారు. నగర పంచాయతీ కమిషనరు సత్యనారాయణ, సిబ్బంది ఘాట్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలేరు నదిపై వంతెన కుంగిపోవడంతో జగ్గంపేట, ఏలేశ్వరం మండలాల నుంచి భక్తుల రాకపోకలకు వీలుగా నీటిలో క్రరలతో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.



చదువు విలువను చాటిచెప్పే నాటికలో కీలక సన్నివేశం

ఫేర్‌వెల్ డే

శంఖవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి సీతారామ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్ డే మంగళవారం ఆనందభరితంగా జరిగింది. నృత్యాలు, విద్య విలువ చాటి చెప్పే నాటికలతో రోజంతా సంతోషంగా గడిపారు. గతేడాది మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించిన అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు, మొగలి అక్కారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గోదావరిలో దిగడానికి అనుమతులు లేవు

దేవీపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత దేవీపట్నం శ్రీఉమా చొడేశ్వరస్వామి ఆలయానికి మహా శివరాత్రి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు దేవస్థానం జల్లుస్నానం ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. గోదావరి నదిలో స్నానం చేయడానికి అనుమతులు లేవని స్పష్టం చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'పది' పరీక్షలు బాగా రాయాలి





విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జెన్‌కో సీఈ వాసుదేవరావు

మోతుగూడెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం డీఏవీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏపీ జెన్‌కో సీఈ వాసుదేవరావు, ఎస్ఈ చిన్న కామేశ్వరరావు, డీఈ బాలకృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించి చదువుచెప్పిన ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకొచ్చి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు రఘురాం మాట్లాడుతూ తొందరపాటు లేకుండా ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు జామెట్రీ బాక్సులు, పెన్నులు బహూకరించారు.



వై.రామవరం మండలం గురమంద శివాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దారు

మహా శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

వై.రామవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గురమంద విశ్వనాథస్వామి, పూతిగుంట ఉబ్బలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద మహా శివరాత్రి ఏర్పాట్లను తహసీల్దారు వేణుగోపాల్ మంగళవారం పర్యవేక్షించారు. మహిళలకు దుస్తులు మార్చుకునేందుకు షెడ్లు ఏర్పాటు చేశామన్నారు. మంచినీరు, వైద్య శిబిరాల నిర్వహణపై కమిటీల సభ్యులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ శాంతకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): మర్రిగూడెం పంచాయతీలోని కొమరస్వామి గుట్టపై వెలసిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం మహా శివరాత్రికి ముస్తాబైంది. ఇక్కడ జరిగే జాతరకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. కూనవరంలో శబరి-గోదావరి సంగమం వద్ద ఉన్న శివాలయంలో కూడా ఏర్పాట్లు చేశారు.

శివ పార్వతుల ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ



రంపచోడవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రంప క్షేత్రంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శివ పార్వతుల పంచలోహ ఉత్సవ విగ్రహాల ప్రతిష్ఠ మంగళవారం జరిగింది. వాటిని పోలీస్ స్టేషన్ నుంచి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. డీఎస్పీ సాయిప్రశాంత్, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, గుండ్ల అంకశ్రీనివాసరెడ్డి, ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయకర్త నల్లమిల్లి వెంకటరామారెడ్డి, శీతంశెట్టి రత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న భక్తులు

గురమంద శివాలయానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

వై.రామవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురమంద విశ్వనాథ స్వామి ఆలయానికి అన్నదానం నిమిత్తం 625 కిలోల బియ్యాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి-భాస్కర్ దంపతులు సమకూర్చారు. వీటిని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, మహిళా అధ్యక్షురాలు రామలక్ష్మి, సీనియర్ నాయకుడు రెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయం వద్ద రోడ్డు మరమ్మతులకు రూ.50వేలు ఎమ్మెల్యే ఇచ్చారని వారు తెలిపారు.



అన్నదానానికి ఎమ్మెల్యే సమకూర్చిన బియ్యం బస్తాలను కమిటీ సభ్యులకు అందిస్తున్న టీడీపీ నాయకులు

మన్యంకొండ జాతర పనులు ప్రారంభం

మోతుగూడెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద మార్చి 3న నిర్వహించే ముత్యాలమ్మ తల్లి (మన్యంకొండ) జాతర పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. సీలేరు నది వద్ద జాతర కమిటీ సభ్యులు, మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, జాతర కమిటీ సభ్యుడు కామేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి వద్ద కూలీలను పెట్టి శుభ్రం చేయిస్తున్నారు.

పోలవరం నిర్వాసితుల జాబితా విడుదల

కూనవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల జాబితాను కూనవరం మేజర్ పంచాయతీ ఈవో సురేష్ మంగళవారం సచివాలయంలో ప్రదర్శించారు. కూనవరం, టేకులబోరు గ్రామాలకు సంబంధించి 2,060 కుటుంబాలు ఇందులో ఉన్నాయి. మార్చి 1, 3 తేదీల్లో గ్రామసభలు నిర్వహిస్తామని, తప్పులు ఉంటే అప్పుడు దరఖాస్తులు ఇవ్వాలని ఈవో కోరారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మోతుగూడెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా మంగళవారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కి, రూట్ ఆఫీసర్, బొడ్డగండి సచివాలయ సెక్రటరీ మురళికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

జ్ఞానజ్యోతి శిక్షణ పూర్తి

వై.రామవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): యార్లగడ్డ ఆశ్రమ పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజులు ఇచ్చిన జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. ఎంఈవో తాతబ్బాయిదొర, ఐసీడీఎస్ సూపర్‌వైజరు బాలాత్రిపురసుందరి, ఉపాధ్యాయుడు పుడిగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్‌కు సత్కారం

స్పేస్ టెక్నాలజీపై సెమినార్

జగ్గంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ దేవరపల్లి చెన్నారావు నేతృత్వంలో స్పేస్ టెక్నాలజీపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1, టెలి కమ్యూనికేషన్స్, శాటిలైట్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వీవీవీ సత్యనారాయణ, సెమినార్ కన్వీనర్లు గోపాలకృష్ణ, వారణాసి మల్లికార్జున శర్మ, అకడమిక్ కో-ఆర్డినేటర్ విశ్వేశ్వర్, డాక్టర్ సత్యలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. మంగళవారం ఆమె నియోజకవర్గ పరిశీలకుడు మెట్ల రమణబాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబులతో కలిసి ప్రత్తిపాడులోని నైపుణ్య, ప్రతిభ, మినర్వా కళాశాలల్లో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ మంతెన శ్రీను, నాయకులు సత్యంశెట్టి సీతారాం, ఇళ్ల అప్పారావు, రావూరి తాతాజీ, పోలిశెట్టి శ్రీను, యర్రాబత్తుల గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా రాష్ట్ర ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు మంగళవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లను కలిసి నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేసి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ఇందుకూరుపేటలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాగాపు బాబూరావు, గోళ్ల చంటిబాబు, ముంద్రు మధుసూదన్‌రావు, టైలర్ నాని, అడబాల వెంకటేశ్వరరావు, సోమరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా వై.రామవరం మండలం డొంకరాయి, చింతూరు మండలం మోతుగూడెంల్లో టీడీపీ ఎన్నికల పరిశీలకుడు దాడి రత్నాకర్, రంపచోడవరం అసెంబ్లీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూనవరం (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా తెలుగు యువత అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్‌కుమార్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.



ప్రత్తిపాడు అఖిల్ కాలేజీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ. మెట్ల రమణబాబు



ఆందోళన చేస్తున్న తాళ్లూరు గ్రామస్తులు

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళన

తుని రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనులు జరుగుతున్న తాళ్లూరు ప్రాంతంలో గ్రామస్తులు ఆందోళనబాట పట్టారు. తాళ్లూరు కొత్త కాలనీతో పాటు పంట పొలాలను కలుపుతూ ఉన్న గట్టును పోలవరం పనులతో తొలగిస్తే ఇబ్బందులకు గురవుతామని, ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళనకు దిగారు. దిగివచ్చిన ఇరిగేషన్ అధికారులు గ్రామస్తులతో పాటు ఆ ప్రాంత రైతులతో చర్చలు జరిపారు. బ్రిడ్జి ఆవశ్యకతను అధికారులకు ఇప్పటికే వివరించామని గ్రామ పెద్దలు చెప్పారు. సరైన భరోసా లేకపోగా గ్రామస్తుల సమస్యలపై స్పందించట్లేదని అధికారులను కుమ్మరిలోవ గ్రామస్తులు నిలదీశారు. బ్రిడ్జి నిర్మాణ అంశంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని, గ్రామస్తులకు ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక సమాధానం ఇప్పిస్తానని డీఈ మురళి హామీ ఇచ్చారు. ఆందోళనలో మాజీ ఎంపీటీసీలు ఆవుగడ్డి వెంకటరమణ, సుర్ల సూరిబాబు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ప్రతిభా పరీక్ష

అన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానం పొందడానికి పదో తరగతి తొలి మెట్టు అని ఎంఈవో ఎస్వీ రమణ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి మంగళవారం ఆయన బహుమతులు అందజేశారు. దేవస్థానం హైస్కూలు ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎంఈవో రమణ

మందుబాబు ఆత్మహత్యాయత్నం

కిర్లంపూడి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి హైవేపై మూడు రోజుల క్రితం మద్యం మత్తులో వీరంగం సృష్టించిన యువకుడు బాబీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కిర్లంపూడి స్టేషన్ రైటర్ తనను తిట్టడంతో పాటు తనకున్న అప్పుల వల్లే ఈ ఘాతుకానికి పాల్పడుతున్నాడని బాబీ సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. కిర్లంపూడి ఎస్ఐ, తల్లిదండ్రులకు ఆ వీడియోలో క్షమాపణలు చెప్పాడు. విషయం తెలుసుకున్న బంధువులు బాబీని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీపీఎం బదిలీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జిల్లా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డీపీఎం, డీఎం డి.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా ఆయనను విజయనగరం ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవో నంబర్ 408 జారీ చేశారు.

ఘనంగా వివేకానంద విద్యా సంస్థల వార్షికోత్సవం

జగ్గంపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్వామి వివేకానంద విద్యా సంస్థల 17వ వార్షికోత్సవం ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ అధ్యక్షతన మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా జగ్గంపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.చెన్నారావు, గౌరవ అతిథిగా జగ్గంపేట జడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవి హాజరై జ్యోతి ప్రజ్వలనతో వేడుకను ప్రారంభించారు. మేనేజింగ్ డైరెక్టర్ ఒమ్మి లక్ష్మీతేజస్వి మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో నూతనంగా కిడ్స్ స్కూల్, మహిళా జూనియర్ కళాశాల ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. విద్యా సంస్థల సిబ్బంది, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థిని నృత్య ప్రదర్శన

బాలబాలికలకు చట్టాలపై అవగాహన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా చట్టాలు, హక్కులు, బాలబాలికల రక్షణ, సైబర్ నేరాలపై ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా మీతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌లను మహిళా పోలీసు సిబ్బంది వివరించారు. డిజిటల్ అరెస్టులు లేవని, ఎవరైనా బ్లాక్ మెయిల్ చేస్తే మోసపోవద్దన్నారు. ప్రేమ పేరుతో వంచించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మహిళాపోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మీకాంతం

క్రికెట్ ప్రాక్టీస్ నెట్ పిచ్ ప్రారంభం

శంఖవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కత్తిపూడి ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన క్రికెట్ నెట్ పిచ్‌ను కాకినాడ హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన వసతులు లేనికారణంగా గ్రామీణప్రాంతాల్లో సత్తా ఉన్నా మెరుగైన క్రికెట్ ఆడలేకపోతున్నారని, ప్రతిభగల క్రీడాకారులను వెలికితీసేందుకే పిచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్, పీడీలు, పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లంకా జార్జ్, సునీల్, అడపా సోమేష్, వ్యాయామోపాధ్యాయుడు తోట వెంకటరాజు, కె.చంటిబాబు, జి.శ్రీను, సోమందొర పాల్గొన్నారు.

మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు

తుని రూరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కూరగాయల పంటల్లో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని తుని వ్యవసాయ శాఖ అధికారి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా మంగళవారం కుమ్మరిలోవలో కూరగాయల పంటలు సాగు చేసే రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు జక్కాన రామునాయుడు, పోతల రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.